క్లుప్తంగా

రెండోరోజూ కొనసాగిన కార్మికుల ఆందోళన

పరిటాల(కంచికచర్ల): మండలంలోని పరిటాలలో న్యూకాన్ తేలికపాటి ఇటుకల తయారీ కంపెనీలో ఓ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెంది 9 నెలలైనా పరిహారం అందజేయలేదని రెండవ రోజు మంగళవారం బాధితులు ఆందోళన చేశారు. ఈ ఏడాది మార్చి 2వ తేదీన న్యూకాన్ బ్రిక్స్ కంపెనీలో పనిచేస్తున్న పరిటాల గ్రామానికి చెందిన పాలంకి హరికృష్ణ ప్రమాదవశాత్తు మృతి చెందిన సంఘటన పాఠకులకు విదితమే. కంపెనీ ప్రతినిధులు పరిహారంతో పాటు బీమా నగదు, ప్రావిడెంట్ ఫండ్ కూడా నెలలోగా చెల్లిస్తామని చెప్పి తొమ్మిది నెలలైనా పరిహారం చెల్లించలేదని హరికృష్ణ భార్యతో పాటు పిల్లలు, బంధువులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు కంపెనీ ప్రధాన ముఖద్వారం ముందు ఆందోళన చేశారు. కంపెనీలో పనిచేసే సిబ్బందిని పనిచేయనీయకుండా అడ్డుకున్నారు.

నందిగామలో చిరుజల్లులు

నందిగామ: నందిగామ ప్రాంతంలో మంగళవారం చిరుజల్లులతో పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురియడంతో ప్రజలు సేద తీరారు.

మంచినీటి ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని హెడ్ వాటర్ వర్క్స్‌లో అకస్మాత్తుగా ప్రధాన పైపులైన్ లీకేజీ జరగడంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు తాగునీటి సరఫరాను అందజేయలేకపోతున్నామని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మంగళవారం తెలిపారు. పైపులైన్ లీకేజీ కారణంగా పట్టణంలోని డాంగే నగర్, డీవీఆర్ నగర్, ఎన్జీవో కాలనీ, వైవై కాలనీ, శాంతినగర్, ఆర్టీసీ కాలనీ, కాకాని నగర్, గాంధీబొమ్మ సెంటర్, సత్యనారాయణపురం, ఎర్ర కాలువ కట్ట, క్రిస్టియన్‌పేట, గరల్స్ హైస్కూల్ రోడ్, రంగుబజారు, మంగలిబజారు, మిట్టగూడెం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా జరగదని తెలిపారు. ఈ ప్రాంతాల్లో నీటి సరఫరా కోసం ఈ కింద తెలియజేసిన నంబర్లలో సంప్రదించాలని కోరారు. చందు 9492524013, సైదా 9490026362, బాలాజీ 9440010780, నరేష్ 9949272588, శివ 9618399871, నాగరాజు 9505783181, ప్రవీణ్ 8096125157.

10న నందిగామలో జగనన్నకు చెబుదాం

నందిగామ: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 10 వ తేదీ శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరవుతారని తెలిపారు.

రైళ్లలో పేలుడు పదార్థాలు తీసుకెళ్తే కఠిన చర్యలు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైలు ప్రయాణంలో పేలుడు పదార్థాలు, బాణసంచా, మండే స్వభావం ఉన్న వస్తువులు తీసుకు వెళ్లడం చట్టప్రకారం నేరమని, అందుకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. దీపావళి సమయంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్‌పీఎఫ్ పోలీసులు, జీఆర్‌పీ పోలీసుల సహకారంతో విస్తృత తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రయాణికులు తమతో పాటు బాణసంచా, గ్యాస్ సిలిండర్లు, యాసిడ్, పెట్రోల్, కిరోసిన్, ఎండు గడ్డి, ఆకులు, థర్మిక్ వెల్డింగ్ తదితర వస్తువులు తీసుకెళ్లడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అందుకు పాల్పడిన వారిపై రైల్వేచట్టం సెక్షన్ 164 ప్రకారం శిక్షార్హమైన నేరం అన్నారు. అందుకు పాల్పడితే మూడేళ్ల జైలు శిక్ష లేదా వెయ్యి రూపాయల జరిమానా, లేదా రెండూ విధించే అవకాశం ఉందన్నారు. రైలులో ప్రయాణికులు ఇటువంటి వస్తువులను తమతో పాటు తీసుకు వెళ్తున్నట్లు గుర్తిస్తే తోటి ప్రయాణికులు దయల్ 139 లేదా రైల్ మదద్ యాప్ ద్వారా ఫిర్యాదు చేస్తే పోలీసులు సకాలంలో స్పందిస్తారని తెలిపారు.

లేగదూడల ప్రదర్శన



జి.కొండూరు: మండలంలోని చిన్ననందిగామ గ్రామంలో పశు సంవర్ధకశాఖ అధికారుల ఆధ్వర్యంలో లేగదూడల అందాల ప్రదర్శన పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు కృత్రిమ గర్భదారణ, లేగదూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటికి అందించాల్సిన పోషకాహారంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించారు. దూడల అందాల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన రైతులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జగనన్న పాలవెల్లువ కమాండ్ కంట్రోల్ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి, పశుసంవర్ధక శాఖ మైలవరం ఏడీ డాక్టర్ హరిహరనాథ్, వెలగలేరు పశు వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం జగన్‌తోనే సాధ్యం

- ఈ నెల తొమ్మిది నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం
- సన్నాహక సమావేశంలో ఎమ్మెల్సీ అరుణకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

వీరులపాడు: రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా, ప్రజలకు సంక్షేమ పథకాలు నిరంతరాయంగా అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని పొన్నవరం, బోడవాడ గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల తొమ్మిది నుంచి నియోజకవర్గంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతిరోజు ఐదు సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత చేసిన మంచిని గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, మోసపూరిత హామీలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని ఆయన సూచించారు. ప్రజాతీర్పు బుక్‌లెట్‌ల ద్వారా జగనన్న ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయాలు సేకరించాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాలు సైతం అభివృద్ధి పథంలో సాగుతున్నాయని చెప్పారు. అవినీతి రహిత పాలన సాగించటమే కాకుండా పార్టీలు, కుల, మతాలకు ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని చెప్పారు. పార్టీ సచివాలయ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్‌లు విధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్‌లు షోడగిరి రాజశ్రీ , శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యులు యాదాల సుజాత, శీలం రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శీలం భాస్కర్‌రెడ్డి, యాదాల దాసు, కొనకాల సాయికుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిటాలలో...

కంచికచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నారని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. మండలంలోని పరిటాల గ్రామంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ చింతా రవీంద్రనాథ్ అధ్యక్షతన మంగళవారం రాత్రి ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు జగనన్న ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలు, ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. ప్రభుత్వ పనితీరు గురించి ప్రజలను అడిగి తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు మోసపూరిత వాగ్దానాల గురించి ప్రజలకు తెలియజేసి, ఆయన పార్టీకి ఓటేస్తే తిరిగి కష్టాల పాలవుతారని వివరించాలన్నారు. ఈనెల 9వ తేదీ నుంచి అన్ని గ్రామాల్లో ఆంధ్రాకు జగనన్న ఎందుకు కావాలి అనే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నన్నపనేని నరసింహారావు, ఎంపీపీ షేక్ మలక్‌బషీర్, సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, జాన్‌బాబు, ఏసుబాబు, నరసింహారావు, యద్దనపూడి విజయారావు, వేముల నాగరాజు, శ్రీధర్, కర్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగుపై దెబ్బతిన్న కాజ్ వే



అడవి రావులపాడు వద్ద నల్లవాగుపై దెబ్బతిన్న కాజ్‌వే



కాజ్‌వే దెబ్బతినడంతో అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- రామన్నపేట రోడ్డులో అడవిరావులపాడు వద్ద ఘటన
- వారం రోజులపాటు రాకపోకలు నిలిపివేత

నందిగామ: మండలంలోని అడవిరావులపాడు సమీపంలో నల్లవాగుపై ఉన్న కాజ్‌వే దెబ్బతినడంతో అధికారులు ఆ మార్గంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. నందిగామ నుంచి అనేక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై అడవిరావులపాడు సమీపంలో 1975 లో నల్లవాగుపై కాజ్ వే ఏర్పాటు చేశారు. 2011లో ఒకసారి దీనికి మరమ్మతులు నిర్వహించారు. తిరిగి సోమవారం రాత్రి కాజ్‌వేలో కొంతభాగం కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ అధికారులకు సమాచారమిచ్చి వెంటనే మరమ్మతులు నిర్వహించాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఆర్ అండ్ బీ డీఈ ఇ.పరశురాముడు, ఏఈ ఇ.వెంకట సరేంద్ర ఆ ప్రాంతాన్ని పరిశీలించడంతో పాటు మిగిలిన కాజ్‌వే సామర్థ్యాన్ని కూడా పరిశీలించారు. అది కూడా పూర్తిస్థాయిలో దెబ్బతినే పరిస్థితి కనిపించడంతో ఆ మార్గంలో వారం రోజులపాటు రాకపోకలు పూర్తిస్థాయిలో నిషేధించినట్లు అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్తగా నిషేధ, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కాజ్‌వే కు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించిన వెంటనే రాకపోకలు పునరుద్ధరించనున్నట్లు తెలిపారు. ఈ మార్గం గుండా వెళ్లవలసిన అడవిరావులపాడు, లింగాలపాడు, లచ్చపాలెం, తక్కెళ్ళపాడు, కొత్త, పాత బెల్లంకొండ వారిపాలెం గ్రామాలు, చెరువుకొమ్ముపాలెం, పెద్దవరం, కోనాయపాలెం, కాండ్రపాడు, గుడిమెట్ల, బ్రహ్మంబొట్లవారిపాలెం, రామన్నపేట గ్రామాలకు చెందినవారు ముప్పాళ్ళ మీదుగా లేదా నవాబుపేట మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. పూర్తి స్థాయిలో కాజ్‌వే మరమ్మతులకు ప్రతిపాదనలు కూడా పంపినట్లు అధికారులు తెలిపారు.

రైతులకు అండగా జగనన్న ప్రభుత్వం

- ప్రభుత్వ విప్ ఉదయభాను
- నియోజవర్గంలో రూ.12.18 కోట్లు రైతు భరోసా జమ

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ ఏటా రూ.13,500 రైతు భరోసా సహాయం అందిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా ఐదో ఏడాది రెండవ విడత ఒక్కొక్కరికీ రూ.4 వేల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 53.53 లక్షల మంది రైతులకు రూ.2,204.77 కోట్లు రైతు భరోసా–పీఎం కిసాన్ సహాయాన్ని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వ్యాప్తంగా సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు రైతులు 30,446 మందికి రూ.12.18 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయండి

- కలెక్టర్ ఢిల్లీరావు
- నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకం మూడో ఆప్షన్ కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఢిల్లీరావు అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై కలెక్టర్ ఢిల్లీరావు.. విజయవాడ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, సబ్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలిసి హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కాంట్రాక్టర్ల వారీగా మ్యాప్ చేసిన ఇళ్లు, పూర్తయిన ఇళ్లు, వివిధ దశల్లో ఉన్న ఇళ్ల వివరాలను పరిశీలించారు. పనులను వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గానికి సంబంధించి 10,991, తూర్పుకు సంబంధించి 7,781, పశ్చిమకు సంబంధించి 9,608 ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. నిర్మాణాల్లో సరైన పురోగతి చూపని కాంట్రాక్టర్లపై సమగ్ర నివేదికలు అందజేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై నిబంధనల మేరకు చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి.. తగిన పరిష్కారం చూపి ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని అధికారులను కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రజనీకుమారి, హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



ర్యాలీ చేస్తున్న సిద్ధార్థ విద్యార్థులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా పీబీ సిద్ధార్థ కళాశాల గుడ్ హ్యాబిట్స్, సైకిల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల పరిసర ప్రాంతాల్లోని రహదారులపై క్యాన్సర్ అవగాహన ర్యాలీ జరిగింది. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు ప్రారంభించి మాట్లాడారు. క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ర్యాలీ అనంతరం కళాశాల ఆవరణలోని మైదానంలో క్యాన్సర్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థులు నిల్చున్నారు.

శ్యాంకుమార్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ



బాధితుడు శ్యాంకుమార్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల: ఆరుగురు వ్యక్తుల దాడిలో గాయపడిన బాధితుడు కె.శ్యాంకుమార్‌ను మంగళవారం రాత్రి ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ విజయవాడ ఆస్పత్రిలో పరామర్శించారు. శ్యాంకుమార్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. శ్యాంకు ఆసుపత్రిలో అయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. శ్యాంకుమార్ కుటుంబానికి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావుతో పాటు తాను కూడా అండగా ఉంటామన్నారు. జరిగిన సంఘటన గురించి టీడీపీ నాయకులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని అన్నారు.

తెలంగాణ నుంచి మద్యం తెస్తూ పట్టుబడిన టీడీపీ కార్యకర్త



గరికపాడు(జగ్గయ్యపేట): తెలంగాణ నుంచి అక్రమంగా మద్యం తీసుకువస్తున్న టీడీపీ కార్యకర్తను చెక్‌పోస్టు వద్ద చిల్లకల్లు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చిలుకూరి రంగ అనే టీడీపీ కార్యకర్త సమీపంలోని రాంపురం అడ్డరోడ్డు నుంచి ద్విచక్ర వాహనంపై అక్రమంగా 50 మద్యం సీసాలు తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో గరికపాడు రాష్ట్ర సరిహద్దు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అతని వద్ద మద్యం ఉన్నట్లు గుర్తించారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణబాబు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి భార్య గ్రామ పంచాయతీలో ఒకటవ వార్డు మెంబరు కావడం గమనార్హం.

ప్రజల ముంగిటకే ప్రజా ప్రతినిధులు

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



గడపగడప సమస్యలపై ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

చందర్లపాడు(నందిగామ టౌన్): ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు ప్రజా ప్రతినిధులు ప్రజల ఇళ్ల ముంగిటకు వెళ్లటం ఒక్క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే చూస్తున్నామని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని పొక్కునూరు, కాసరబాద గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దృష్టికి వచ్చిన సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులతో మంగళవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో సమస్యలు తెలిపేందుకు ప్రజలు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగేవారని కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో మాత్రం ప్రజాప్రతినిధులే ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుని తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకే ఒక్కో సచివాలయానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షల నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. ఆ నిధులతో ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేసి అందుకనుగుణంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సైతం గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొమ్మినేని మహేంద్ర, చల్లా శివయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించే వారికే తాత్కాలిక అనుమతులు

ఆర్డీవో సాయిబాబు



అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో సాయిబాబు

నందిగామ: బాణసంచా విక్రయ దుకాణాల ఏర్పాటుకు తప్పనిసరిగా అవసరమైన అన్ని శాఖల అనుమతులు ఉండాలని ఆర్డీఓ పి.సాయిబాబు అన్నారు. దీపావళి సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో ఏర్పాటు చేయబోయే బాణసంచా విక్రయ దుకాణాలకు ఇచ్చే తాత్కాలిక అనుమతులపై మంగళవారం సాయంత్రం పలు శాఖల అధికారులతో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయబోయే ప్రాంతంలో తప్పనిసరిగా అన్ని శాఖల అనుమతులతో పాటు అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకునేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అవసరమైన అన్ని శాఖల అనుమతులు తీసుకున్న వారికే తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేయాలని సూచించారు. సమావేశంలో ఏసీపీ జనార్దన్ నాయుడు, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, డివిజన్ పరిధిలోని అన్ని మండలాల తహసీల్దార్‌లు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త వ్యర్థాలను ఎర్రకాలువల్లో వేయవద్దు

- పరిశుభ్రత పాటించి దోమలను నిరోధించాలి
- మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్



ఎర్రకాలువలో మలాథిన్, ఆయిల్ బాల్స్‌ను వదిలే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న వైస్ చైర్మన్ ప్రభాకర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రజలు తమ గృహాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్తను ఎర్రకాలువలో పడవేయకుండా మున్సిపాలిటీ వారి చెత్త బండిలో పడవేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ విజ్ఞప్తిచేశారు. జగ్గయ్యపేట పట్టణంలో దోమల వ్యాప్తికి ప్రధాన కారణమైన ఎర్రకాలువలో దోమలు వృద్ధి చెందకుండా మలాథిన్, బయోటెక్ కెమికల్ కలిపిన ఆయిల్ బాల్స్‌ను మున్సిపల్ సిబ్బంది ఎర్రకాలువలో వదిలే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో దోమలు వ్యాప్తి చెందకుండా మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అన్ని చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు కూడా తమ గృహాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సీహెచ్ నాగమల్లేశ్వరరావు, కౌన్సిలర్ పందుల రోశయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

కరువు మండలంగా ప్రకటించాలంటూ తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన జెడ్పీటీసీ నాగమణి, ఎంపీడీఓ సిద్ధారెడ్డి, తహసీల్దార్ లక్ష్మీకల్యాణి

పెనుగంచిప్రోలు: అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ విజ్ఞప్తిచేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సమస్యలను, అవసరాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా ఇబ్బందులు రాకుండా అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.60 లక్షలు వచ్చాయని, వాటిలో రూ.25 లక్షలు శనగపాడులో డ్రైనేజీ నిర్మాణానికి, రూ.20 లక్షలు పెనుగంచిప్రోలులో, రూ.15 లక్షలు అనిగండ్లపాడులో సీసీ రోడ్ల నిర్మాణానికి వినియోగించనున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి మాట్లాడుతూ గ్రామంలో పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి శ్రీతిరుపతమ్మవారి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సూచనలతో రూ.27 లక్షలు జెడ్పీ నిధులు కేటాయించారన్నారు. తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి మాట్లాడుతూ గ్రామాల్లో భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఉద్యానవన శాఖాధికారి వర్ధిని మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు లేక బెట్ట పరిస్థితులు ఉన్నాయని, దీంతో 50 శాతం మిర్చి పంట వడలిపోతోందన్నారు. మిర్చిలో బొబ్బర తెగులు, ఎండు తెగులు ఉందని రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం మండలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయని కరువు మండలంగా ప్రకటించాలని తీర్మానం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు గుంటుపల్లి వాసు, కనగాల శ్రీనివాసరావు, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ జాన్‌మియా, ఎంపీడీఓ కె.సిద్ధారెడ్డి, ఏఓ కె.రామసుబ్బారెడ్డి, వైద్యాధికారి పి.ఇందిర, పశు వైద్యాధికారి అనిల్, పీఆర్ ఏఈ సుందరరామయ్య, హౌసింగ్ ఏఈ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు, ఎంఈఓ రవీంద్ర, ఏపీఎం రాజారావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కంచికచర్ల: చేసిన అప్పులు తీర్చలేననే మనోవ్యధతో ఓ వ్యక్తి పొలాల్లోకి వెళ్లి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో జరిగింది. ఎస్ఐ పీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు మండలంలోని గనిఆత్కూరుకు చెందిన షేక్ బుడే(50) తన సొంత స్థలంలో ఇల్లు కట్టుకున్నాడు. అయితే ఆ ఇంటి నిర్మాణం కోసం ఇతరుల నుంచి అప్పులు తీసుకున్నాడు. ఆ అప్పులు తీర్చలేకపోతున్నాననే మనస్తాపంతో పొలాల్లోకి వెళ్లి ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న రైతులు కొంతమంది చూసి చెట్టుకు వేలాడుతున్న వ్యక్తిని చూసి పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి కిందకు దించి చూడగా బుడే అప్పటికే మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బుడే మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.